క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: జిల్లా వినియోగదారుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే శనివారం తెలిపారు. తెలుగు వక్తృత్వ పోటీలో ఎం.శ్రావణి, ఇంగ్లీషులో టి.రేఖ, తెలుగు వ్యాచరచన విభాగంలో కె.రమ్య, ఇంగ్లీష్ విభాగంలో ఈవీడీ హారిక ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె.వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, కళాశాల వినియోగదారుల క్లబ్ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థులను అభినందించారు.

నేడు ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం బొమ్మూరులోని నరసింహరాజు ఫంక్షన్‌హాల్లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని సంఘ సభ్యులతో పాటుగా గతంలో సభ్యులుగా ఉన్న విశ్రాంత ఉద్యోగులు, ప్రమోషన్స్‌పై వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారే కాకుండా తెలంగాణ నుంచి అనేక మంది పాల్గొంటున్నారన్నారు. జనరల్ బాడీ సమావేశం అనంతరం రాబోయే మూడేళ్లకు ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ సూర్యనారాయణరాజు తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



పాఠశాలలో ధాన్యపు కుచ్చును పరిశీలిస్తున్న ఎంఈవో మణికుమార్

కడియం: మానవ మనుగడకు హాని కలిగించేవి తప్పితే, ప్రతి జీవికి మానవులతో సమానంగా జీవించే హక్కు ఉందని కడియం మండల విద్యాశాఖాధికారి-1 ఎం.మణికుమార్ అన్నారు. శనివారం ఆయన వేమగిరితోట-1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పనితీరు గార్డెన్ బాగుందన్నారు. ఈ సందర్భంగా పిచుకలు తినడానికి ధాన్యపు వెన్నుల బంచ్ కడుతూ మనతోపాటు అన్ని జీవులు బతకడానికి సహకరించాలన్నారు. కనీసం జీవవైవిధ్యానికి అవకాశమైనా ఇవ్వాలని ఎంఈఓ విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. ఈ మేరకు కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు . కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఓ జయరాజు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ధవళేశ్వరం: ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యమత్యంగా ముందుకు సాగి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి జై.కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పాలిక రాజబాబు, కోశాధికారి కేఎస్ గౌరీశంకర్, సహాధ్యక్షుడు బి.లక్ష్మణుడు, ఉపాధ్యక్షుడు పీఎస్ శేషుకుమార్, ఎస్.సత్తిరాజు, ఎం.సతీష్ కుమార్, కె.శ్రీనివాసరాజు, ఆదిత్య సోమేశ్వర్, ఎస్.వాసుదేవి, ఏవీవీ రామారావు, నూకరాజు ,గోపి, రమేష్, ఎ.శ్రీనివాస్, కుమారి, కుమారస్వామి, సురేష్ బాబు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

సీటీఆర్ఐ: శాంతి, దయ, కరుణ, ప్రేమతో మెలగడం అలవాటు చేసుకుని క్రీస్తు చూపిన మార్గంలో అందరూ నడవాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం స్థానిక దహించు అగ్నిలో క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దహించు అగ్ని సేవకులైన 2 వేల మందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ క్రీస్తు ప్రేమను చాటడానికి ఇలాంటి సేవా కార్యక్రమలు ఏటా నిర్వహిస్తున్న దహించు అగ్ని థామస్‌ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షక్‌లు

- అతివలకు రక్షణ కోసం మహిళా రక్షక్ టీం ఏర్పాటు
- ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్న పోలీసు బృందం
- ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణ

కంబాలచెరువు,(రాజమహేంద్రవరం): గోదావరి నది తీరం గౌతమీ ఘాట్ వద్ద ఓ మహిళ ఒంటరిగా కూర్చుని ఏడుస్తోంది. విధి నిర్వహణలో భాగంగా మహిళ రక్షక్ టీం అటుగా వెళ్లి ఆ మహిళని గమనించి ఆరా తీశారు. ఆమెది మండపేట అని, భర్త ప్రతిరోజు తాగి వచ్చి ఆమెతో ఘర్షణ పడుతుండడంతో భర్త ప్రవర్తనపై మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందామని అక్కడికి వచ్చినట్టు చెప్పింది. ఈ విషయమై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళా రక్షక్ టీం ఇన్‌చార్జి కె.మంగాదేవి అప్రమత్తమయ్యారు. ఆ మహిళ తల్లిదండ్రులు భర్తను పిలిపించారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఆ మహిళను వారికి అప్పగించారు. ఆమెకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఆత్మహత్య చేసుకునే తలంపుతో ఉన్న మహిళను కాపాడి క్షేమంగా అప్పగించినందుకు మహిళా రక్షక్ టీంకు ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

క్షేత్రస్థాయికి.. మహిళా పోలీసులు

నగరం, గ్రామీణంలో మహిళా రక్షక్ వాహనాలు మూడు షిఫ్టులుగా నిరంతరం తిరుగుతుంటాయి. మహిళ హెచ్సీ, పీసీలు బృందంగా సంచరిస్తున్నారు. ముఖ్యంగా కళాశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆలయాలు ఇలా మహిళలు ఎక్కువ సంచరించే ప్రాంతాల్లో గస్తీ తిరిగే మహిళా రక్షక్ బృందాలు తమ దృష్టికి వచ్చిన మహిళా సమస్యలతో పాటు, కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగవంతంగా స్పందిస్తున్నారు. ఈవ్ టీజింగ్, చదువుకున్న అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేయడం, ముఖ్యంగా రాత్రి సమయాల్లో మహిళలు ఇబ్బందులు పడే సందర్భాలను, ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా మహిళల రక్షణ మరింతగా సాధ్యమవుతోంది. ఏ ఘటనైనా సెన్‌ఫోనులో చిత్రీకరించి కంట్రోల్ రూమ్ పంపుతారు. ఏ తరహా ఆపదలో ఉన్న వారైనా సరే మహిళ రక్షక్‌ను ఆశ్రయిస్తే వారికి పోలీసులు రక్షణగా నిలుస్తున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న రక్షక్ టీమ్ సభ్యులు

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



"మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో అమలు చేస్తున్న మహిళా రక్షక్‌ని సద్వినియోగం చేసుకోవాలి. మహిళలు, యువతులు, విద్యార్థినులు, బాలికలు ఎటువంటి ఆపద సమయంలోనైనా టోల్ ఫ్రీ నంబర్‌కి ఫోన్ చేయవచ్చు. మహిళ పోలీసులు వెంటనే వారిని కలిసి సమస్య తెలుసుకుంటారు. తగు పరిష్కారం చూపిస్తారు. రక్షక్ వ్యవస్థ పనితీరుపై ప్రతి మహిళ అవగాహన పెంచుకుని మా సేవలు ఉపయోగించుకోవాలి"

– కే.మంగాదేవి, మహిళా స్టేషన్ సీఐ

ఆకతాయి నుంచి కాపాడి..

మహిళా రక్షక్ టీంకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను నగరంలో శివారు రోడ్లో వెళుతుండగా. ఓ బాలిక ఒంటరిగా కనపడిందని అక్కడ కొంత మంది యువకులు అనుమానాస్పదంగా ఉన్నారని తెలిపారు. సమాచారం అందుకున్న రక్షక్ టీం మహిళా బృందం హుటాహుటీన అక్కడకి చేరుకున్నారు. పోలీసులు రాకతో ఆకతాయి యువకులు పరారయ్యారు. బాలికను ఆరా తీయగా తనది వైజాగ్ అని తాను ఇంటి నుంచి అలిగి వచ్చానని నేను ఒంటరిగా వెళుతుండడం చూసి ఆ యువకులు వెంటపడ్డారని తెలిపింది. బాలిక తెలిపిన వివరాల మేరకు ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు.

ఇన్‌స్టాగామ్‌కు ప్రభావితమై..

జిల్లా మహిళా రక్షక్ టీం సోమవారం రాత్రి గస్తీ తిరుగుతుండగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అనుమానాస్పందంగా తిరుగుతున్న నలుగురు మైనర్ బాలికలను గుర్తించారు. వారిని అనుమానంతో ఆపి వివరాలు అడగ్గా పొంతన లేని సమాధానం చెప్పారు. వారిని సమగ్రంగా ప్రశ్నించగా తామంతా ఇన్‌స్టాగామ్‌లో స్నేహితులని ఏదో సాధిద్దామని దూరంగా వెళ్లిపోయేందుకు ఇంట్లో వారికి చెప్పకుండా వచ్చామని వారు చెప్పడంతో మహిళా రక్షక్ టీం అప్రమత్తమయింది. ఆ బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారిని రప్పించారు. బాలికలకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు.

బాలికలకు కౌన్సిలింగ్

ఇద్దరు మైనర్ బాలికలు ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఒక మైనర్ బాలుడితో ఇంట్లో చెప్పకుండా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుని అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్‌లో ఉన్న మహిళా రక్షక్ టీం వారిని గుర్తించి, ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. వారి తల్లిదండ్రులను పిలిపించి, బాలికలకు కౌన్సిలింగ్ ఇచ్చి క్షేమంగా అప్పగించారు.

ఒంటరి మహిళను కాపాడి


రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉన్న మహిళను ఒక ఆకతాయి అటకాయించగా ఆమె భయంతో కేకలు వేసింది. సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న మహిళ రక్షక్ టీం క్షణాల్లో అక్కడ చేరుకుని ఆకతాయిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి హెచ్చరించారు.

ఇలా ఎంతోమంది మహిళలకు మహిళ రక్షక్ టీం అండగా నిలుస్తోంది. జిల్లా ఎస్పీ ఈ టీంను స్వయంగా పర్యవేక్షించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా రక్షక్ టీం ఏర్పడిన 80 రోజుల్లోనే ఎంతోమంది అబలలను ఆపద నుంచి రక్షించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 'మహిళా రక్షక్' మహిళల రక్షణలో దిశా నిర్దేశంగా నిలుస్తోంది.

112కి కాల్ చేస్తే నిమిషాల్లో ప్రత్యక్షం

112కి డయల్ చేసిన నిమిషాల వ్యవధిలోనే మహిళా రక్షకులు ఘటన స్థలానికి చేరుకుంటారు. ఆ టోల్ ఫ్రీ నబర్‌తోపాటు తూర్పుగోదావరి జిల్లా వారైతే '9493206006 ఈ సెల్ నంబర్‌కు కాల్ చేయవచ్చు. మహిళల రక్షణలో నిత్యం పనిచేస్తుంటాయి. ఈ నంబర్లు నిరంతరం జిల్లా ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో ఉంటాయి. ఆ నంబర్లకు ఫోన్ చేసిన వెంటనే కాల్ సెంటర్లో పోలీసు ఉద్యోగులు సంబంధిత వివరాలు తీసుకుని నేర స్థలానికి దగ్గరలో ఉన్న పోలీస్ సిబ్బందికి పంపుతారు. దీనివల్ల తక్కువ సమయంలోనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుంటారు. ఆపదలో ఉన్న అతివలను రక్షిస్తారు.

పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అర్జీలు నమోదు చేయాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎం.ఆలీలతో తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ ద్వారా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న పౌరసేవల ప్రగతిపై సోమవారం అమరావతిలో నిర్వహించే ప్రాంతీయ సదస్సులో జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించనున్నారని తెలిపారు. ఇందులో ప్రజా సమస్యల పరిష్కార విధానం, నీటి పన్ను, ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఇంటి స్థలాల స్థితి, గ్రామసభ ఫిర్యాదుల పరిష్కార స్థితి, సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు తదితర అంశాలపై సమీక్షిస్తారని వివరించారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయి పనితీరుపై సమీక్షించే అవకాశం ఉందని చెప్పారు. ఈ అంశాలపై నివేదికలతో క్షేత్ర స్థాయి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.

19న మళ్లీ నిరసన దీక్ష



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బర్రే కొండబాబు

ప్రకాశం నగర్: ప్రమాదకరంగా మారి మనుషులు ప్రాణాలు తీస్తున్న క్వారీ గోతుల సమస్యకు పరిష్కారం చూపించకపోతే జనవరి 19న క్వారీ గోతుల నీటి మధ్యలో మళ్లి దీక్ష చేపడతానని, 'ఈ సారి నీరన్నా తోడాలి..నా ప్రాణాలైనా పోవాలి' అని నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు అల్టిమేటం ఇచ్చారు. క్వారీ గోతుల సమస్యపై శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గే తొలుత క్వారీ యజమానులతోను, తర్వాత బర్రే కొండబాబు బృందంతోను విడివిడిగా సమావేశమై చర్చించారు. అనంతరం బర్రే కొండబాబు మీడియాతో మాట్లాడుతూ 19వ తేదీ లోపు సమస్య పరిష్కారానికి కార్యాచరణ మొదలవ్వాలని స్పష్టం చేశారు. అధికారులతో ఇలాంటి సమావేశాలు జరిగినప్పుడు క్వారీ యజమానులు గోతులు పూడ్చేందుకు సానుకూలంగా మాట్లాడుతున్నారు. కాని తర్వాత ఆ ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఈ సమస్యపై యజమానులు, సంబంధిత అధికారులతో తన పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. 45వ వార్డులో క్వారీ గోతుల నీటిని తోడేందుకు రూ.85లక్షలతో పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారని, అదేవిధంగా సింహాచలనగర్, సుబ్బారావు నగర్, సున్నంబట్టి లేఅవుట్ రోడ్డులోని క్వారీ గోతుల్లో నీటిని తోడించేందుకు తక్షణం పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి నగరపాలక సంస్థ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను గత కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతూ ఉండగానే ఆ గోతుల్లోపడి మరో ఐదు శవాలు తేలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఎంతమంది ప్రాణాలు కోల్పోవాలని కొండబాబు ప్రశ్నించారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కూడా దీనికి బాధ్యత తీసుకోవాలని కోరారు. జనవరి 19వ తేదీ లోగా పరిష్కారం చూపించక పోతే క్వారీ గోతుల నీటి మధ్యలో దీక్ష చేపడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, బూర్తి సత్యనారాయణ, మారు జగదీష్, పెదపూడి లోవరాజు, శివకోటి దావీదు, గారా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కట్టా కుటుంబానికి మాజీ మంత్రి వేణు పరామర్శ



కట్టా జమిందార్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు

కడియం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కట్టా నగేష్ (జమిందార్)ను ఆయన స్వగ్రామమైన వేమగిరిలో శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. జమిందార్ తల్లి కట్టా విజయలక్ష్మి ఇటీవల స్వర్గస్తులైనారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి చెల్లుబోయిన వేణు పూలమాలలు వేసి, నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల పార్టీ అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఉన్నారు.

మాజీ ఎంపీ ఉండవల్లి పరామర్శ



గట్టి సత్యనారాయణమూర్తిని పలకరిస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్

కడియం: అస్వస్థతకు గురై ప్రస్తుతం కోటుకుటున్న బుర్రిలంక గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణమూర్తిని శనివారం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అల్లుబాబి, జాంపేట కోఆపరేటివ్‌బ్యాంక్ డైరెక్టర్ ప్రసాదుల హరినాథ్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా గట్టి సత్యనారాయణమూర్తిని మాజీ ఎంపీ ఉండవల్లి ఆప్యాయంగా పలకరించి, గంటకుపైగా కాంగ్రెస్ పార్టీలో వారి అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

సంస్కరణల పితామహుడు మన్మోహన్‌సింగ్

నివాళులర్పించిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



ప్రకాష్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉండవల్లి అరుణ్‌కుమార్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రపంచమంతా అల్లకల్లోలంగా ఉన్న దశలో భారత్‌దేశాన్ని సంస్కరణ బాట పట్టించిన నాయకుడు మన్మోహన్‌సింగ్ అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కొనియాడారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రకాష్‌నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొద్ది సేపు మౌనం వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ప్రధానిగా ఉన్నప్పుడు సలహాదరుడిగా ఉన్న మన్మోహన్ సింగ్‌నీ తరువాత ప్రధాని పీవీ నరసింహరావు ఆర్థిక మంత్రిని చేశారు. ఆయన ప్రతి నెలా ప్రెస్‌మీట్ నిర్వహించేవారు. మన్మోహన్ సింగ్ ఎవ్వరూ చెప్పినా వింటారని, వినడం అన్నది ఆయన దగ్గర చూసి నేర్చుకోవాలన్నారు. నోరు ఎత్తని వాడు, నోట్లో నాలుక లేని వాడు ప్రధాని అవ్వడం సాధారణమైన విషయం కాదన్నారు. మన్మోహన్ సింగ్ దేశానికి అవసరమని సోనియా గాంధీ ప్రధానిగా మన్మోహన్ సింగ్‌ని చేశారన్నారు. ఆయన తీసుకువచ్చిన ఆర్టీఐ చట్టం వల్ల అనేక కుంభకోణాలు బహిర్గతమవుతున్నాయన్నారు. డిమానిటైజేషన్ ద్వారా దేశ జీడీపీ 2 శాతం పడిపోతుందని మన్మోహన్ సింగ్ ఊహించి చెప్పినట్టుగానే డిమానిటైజేషన్ తరువాత జరిగిందన్నారు. ఆయన కమిట్మెంట్ ఉన్న వ్యక్తి అని, భారత్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నెహ్రూ తరువాత కొత్త ఆలోచనతో పాలన చేసిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని అన్నారు. భారత్ దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ వ్యక్తి మన్మోహన్ సింగ్‌ని అన్నారు.

రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రేషన్ కార్డులు సర్దుబాటు వలన ఏర్పడిన ఖాళీల భర్తీకి చౌకధరల దుకాణాల శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకం చేపడుతున్నట్టు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం డీలరు రాజీనామా చేయడం, కొంత మంది మృతి చెందడం వల్ల గుర్తించిన ఖాళీలు, రేషన్ కార్డుల సర్దుబాటు వలను కొన్ని చోట్ల కొత్తగా ఏర్పడిన ఖాళీలను భర్తి చేస్తున్నట్టు తెలిపారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా జరుగుతందున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందుపరచిన నిబంధనలకు లోబడి తమ దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో గానీ, రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి(సబ్ కలక్టరు) కార్యాలయంలో నేరుగా జనవరి 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలన్నారు. దరఖాస్తులు తహసీల్దార్ , సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో పొందవచ్చున్నారు.

3,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



గోదావరిలంకల్లో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ పి.హనుశ్రీ ఆధ్వర్యంలో గోంగూరలంక, పిచ్చుకలంక, జౌరంగ్‌బాద్ గోదావరి లంకల్లో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 18 డ్రమ్ముల్లో ఉన్న 3,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సై ఎ.రామాంజనేయ, హెడ్‌కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం

కంబాలచెరువు: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట రీత్యా నేరమని, ఎవరైనా ఎక్కడైనా నిర్వహిస్తే వారి లైసెన్సు రద్దు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో డీఎం అండ్ హెచ్‌వో అధ్యక్షతన ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, గవర్నమెంట్ స్కానింగ్ సెంటర్స్‌కు పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ఇంప్లిమెంట్‌పై కెపాసిటీ బిల్డింగ్ పేరుతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధం అనే బోర్డులను ప్రదర్శించాలని, ఫాం-ఎఫ్‌లు ప్రతినెల ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్‌లలో గర్భిణులు స్కానింగ్ చేసినప్పుడు వారికి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూదన్నారు. అలా చేస్తే . భారతీయ శిక్షాస్మృతిలో 1994 యాక్ట్ ప్రకారం మొదటిసారి వారికి 50 వేలు జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించి, లైసెన్సు రద్దు చేస్తామన్నారు. అనంతరం బేస్డ్ వైలెన్స్ ఎండ్ మెడికో లీగల్ కేర్ ఫర్ సూపర్‌వైజర్లకు వైలెన్స్‌పై స్కానింగ్ సెంటర్స్ వారికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ పీఎస్ఎల్.ప్రసన్న, డాక్టర్ సంధ్య, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగరత్నం, సీడీపీవో నర్సమ్మ, సత్యకుమార్ నల్లూరి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మూగ వేదన

- చర్మవ్యాధితో ఉన్న వీధి కుక్కలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు



గ్రామాలలో తిరుగాడుతున్న డెర్మటైటిస్ వ్యాధి సోకిన కుక్కలు

సీతానగరం: వీధి కుక్కలు చర్మవ్యాధిలతో బాధపడుతున్నాయి. ఈ చర్మ వ్యాధి పశువులకు, మనుషులకు సోకే అవకాశం ఉంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వీటిని తాకినా, ఇవి కాటు వేసినా ప్రాణానికే ప్రమాదమని చెబుతున్నారు. కుక్కలకు సోకిన చర్మవ్యాధిని డెర్మటైటిస్ అని అంటారు. ఈ వ్యాధి సోకిన కుక్కలకు చర్మంపై వెంట్రుకలు ఊడిపోయి పొక్కులు వచ్చి చూడడానికే భయం కనిపిస్తాయి. చర్మమందంగా తయారవుతుంది. ఇది అంటువ్యాధి. ఇటువంటి కుక్కల వలన రాబిస్ వ్యాధి సోకే అవకాశం ఉంది.

ఇది అంటు వ్యాధి

ఈ డెర్మటైటిస్ సోకిన కుక్కలు మనుషులకు తగిలినా, పశువులకు తగిలినా తొందరిగా వ్యాప్తి చెందుతుంది. మనుషులకు చర్మంపై ఉన్న వెంట్రుకలు రాలిపోయి, మచ్చలు ఏర్పడి, చర్మం మదంగా మారుతుంది. పశువులకు అయితే మచ్చలు ఏర్పడతాయి. రాబిస్ సోకిన కుక్కలు కరిచిన పశువులకు ఆ వ్యాధి సోకే అవకాశం ఉంది. జంతువుల్లో చొంగకార్చడం, డొక్కలు లోపలికి నొక్కుకున్నట్టు ఉండడం, మేత తీసుకోకపోవడం వంటివి కనిపిస్తాయి. వారం రోజుల్లో పశువులు చనిపోతాయి. మనుషుల్లో కూడా అంతే జరుగుతుంది.

అధిక సంఖ్యలో..

నియోజకవర్గ గ్రామాల్లో ఎక్కడ చూసినా పదుల సంఖ్యలో చర్మవ్యాధితో ఉన్న కుక్కలే కనిపిస్తున్నాయి. కుక్కలకు వేసే వ్యాక్సిన్ వేయకపోవడంతో ఈ వ్యాధి వ్యాప్తి చెందినట్టు వైద్యులు చెబుతున్నారు. మున్సిపాలిటి, కార్పొరేషన్‌లల్లోను కుక్కలకు గర్భనిరోధక ఆపరేషన్లు చేస్తున్నారు. కాని గ్రామాల్లో మాత్రం ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు. రోజుకు స్థానిక పీహెచ్‌సీలకు పలువురు రాబిస్ వ్యాక్సిన్ వేయించుకుంటునే ఉన్నారు. చర్మవ్యాధులతో బాధపడే కుక్కల సంఖ్య అత్యధికంగానే ఉంది. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

షాడే స్కూలు లీజు చట్టబద్ధమే...

ఏఈఎల్‌సీ సెక్రటరీ అర్నల్డ్ మోజెస్

కంబాలచెరువు రాజమహేంద్రవరం: షాడే స్కూల్‌కు అనుకుని ఉన్న ఏఈఎల్‌సీ స్థలం లీజు చట్టబద్ధమేనని, నిబంధనల ప్రకారమే లీజు ప్రక్రియ జరిగిందని ఏఈఎల్‌సీ సెక్రటరీ చిన్నం కిశోర్‌బాబు, ట్రెజరర్ కె.మోజెస్‌ఆర్నల్డ్ తెలిపారు. స్థానిక కిమ్స్ బొల్లినేనిలో శనివారం జరిగిన క్రిస్మస్ వేడుకలకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ షాడే స్కూల్‌కు అనుకున్న ఉన్న లీజు విషయంలో కొంతకాలంగా వివాదాలు జరుగుతున్న విషయం తెలిసిందేనన్నారు. అలాగే సబ్ లీజు చెల్లుబాటు అవుతుందన్నారు. దీన్ని ఏఈఎల్‌సీ పాలకవర్గం పరదేశీ బాబు ఇచ్చారని చెప్పారు. అయితే లీజుదారులకు, సబ్ లీజుదారులకు ఏఈఎల్‌సీ తరపున మా పూర్తి మద్దతు ఉంటుందని, అవరమైతే కోర్టుకు వచ్చి ఏఈఎల్‌సీ తరపున తమ వాదనలు వినిపిస్తామన్నారు. అలాగే నగరంలో ఉన్న ఏఈఎల్‌సీ ఆస్తులు విషయంలో పలు రకాల వదంతులు వినిపిస్తున్నాయని, వాటిని ఎవరూ నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ సంఘ పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప-2
అనుశ్రీ	: శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్
రాజా	: పుష్ప-2
ఊర్వశి	: డ్రింకర్ సాయి
మేనక	: బేబీ జాన్
రంభ	: ముఫాసా
కుమారి	: ముఫాసా
అప్సర	: పుష్ప-2
అశోక నామవరం	: బచ్చలమల్లి
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: పుష్ప-2
మురళీకృష్ణ కడియం	: పుష్ప-2
వెంకటసూర్య	: ముఫాసా, పుష్ప-2